విశాలాంధ్ర
గోదావరి జిల్లా
కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ

స్పందన అర్జీలను గడువులోపు పరిష్కరించాలి

- జిల్లా కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా

- 280 అర్జీల స్వీకరణ

విశాలాంధ్ర - కాకినాడ : స్పందన ప్రజా ఫిర్యాదుల వేదిక కార్యక్రమంలో అందిన ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, గడువులోపు పరిష్కరించాలని జిల్లా కలెక్టరు డాక్టర్ కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా స్థాయి ప్రజా విజ్ఞాపనల స్వీకరణ, పరిష్కార కార్యక్రమం కాకినాడ కలెక్టరేట్‌లో నిర్వహించారు. కార్యక్రమంలో కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా..జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, డీఆర్వో కె. శ్రీధర్ రెడ్డి, బీసీ, ఎస్సీ కార్పొరేషన్ల ఈడీలు ఎస్.వి.ఎస్ సుబ్బలక్ష్మి, డీఎన్ సునీతలతో కలిసి కాకినాడ జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి విజ్ఞాపనలను స్వీకరించి ఆయా శాఖల ద్వారా నిర్దిష్ట గడువులో పరిష్కారానికి అధికారులకు ఆదేశాలిచ్చారు. కార్యక్రమంలో 280 అర్జీలు స్వీకరించారు. వివిధ సంక్షేమ పథకాలు, కార్యక్రమాలు, ఉద్యోగ ఉపాధి అవకాశాలు, పేదలందరికీ ఇళ్ల కింద ఇళ్ల మంజూరు, రెవెన్యూ సేవలు, సర్వే, పెన్షన్ తదితరాలపై అర్జీలు వచ్చాయి. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లాస్థాయి అధికారులు, కలెక్టరేట్ సెక్షన్ల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు దుప్పట్లు, ఆహార ప్యాకెట్లు పంపిణీ

విశాలాంధ్ర - అనపర్తి : స్థానిక పాత ఊరులోని ప్రాచీన శ్రీ ఉమా రామలింగేశ్వర స్వామివారి ఆలయ ప్రాంగణంలో కార్తీక మాసం పురస్కరించుకొని వ్యాపారవేత్త కర్రి రామారెడ్డి గంగాభవాని దంపతులు సుమారు 150 మంది వయోవృద్ధులు, వికలాంగులు, యాచకులకు దుప్పట్లు, ఆహార ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కర్రి రామారెడ్డి మాట్లాడుతూ క్రమం తప్పకుండా 17 ఏళ్ళుగా ప్రతి ఏడాది కార్తీక మాసంలో ఒక సోమవారం ఈ సేవా కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పోతంశెట్టి శ్రీనివాసరెడ్డి, రెడ్డి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

150 మందికి ఉచిత కంటి వైద్య పరీక్షలు

విశాలాంధ్ర - ఏలేశ్వరం : లయన్స్ క్లబ్ ఆఫ్ బనానా ల్యాండ్ ఏలేశ్వరం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత నేత్ర చికిత్సా శిబిరంను మున్సిపల్ కమిషనర్ కెపి కొండలరావు ప్రారంభించారు. ఆప్తమాలిక్ అసిస్టెంట్ ముత్యాలు సుమారు 150 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 15 మందిని ఆపరేషన్ నిమిత్తం రాజానగరం జిఎస్ఎల్ ఆసుపత్రికి పంపిస్తున్నా మన్నారు. ఈ కార్యక్రమంలో అలమండ దుర్గా వెంకట ప్రసాద్, కటకం కిరీటి, బుజ్జి తదితరులు ఉన్నారు.

మద్యం సేవించి వాహనాలు నడిపితే జైలుకే

విశాలాంధ్ర - గోకవరం : మద్యం సేవించి వాహనాలు నడిపితే జైలుకు వెళతారని గోకవరం పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ శివ నాగబాబు సోమవారం నాడు విలేకరులతో అన్నారు. గోకవరం మండలంలోని గ్రామ పంచాయతీల లోని ఎవరైనా ప్రజలు బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించినా, పిల్లలకు విద్యార్థులకు వాహ నాలు ఇచ్చినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సబ్ ఇన్స్పెక్టర్ తెలిపారు. పిల్లల పట్ల తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధతో పాటు భయభక్తులు నేర్పించాలని అన్నారు. గ్రామ సర్పంచ్లు, ఎంపీటీసీ సభ్యులు, ప్రజా ప్రతినిధులు, సహకరించాలని గోకరం ఎస్సై విజ్ఞప్తి చేశారు.

కలెక్టర్ దృష్టికి నియోజకవర్గ సమస్యలు

విశాలాంధ్ర - రాజోలు : రాజోలు నియోజకవర్గంలో రైతులకు ప్రధాన సమస్యగా మారిన డ్రైన్స్, రోడ్లకు సంబంధించి సమస్యలను మలికిపురం మండలం జడ్పీటీసీ బళ్ళ ప్రసన్న కుమారి రత్న రాజు అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ హిమన్షు శుక్లా దృష్టికి తీసుకెళ్ళారు. సోమవారం ఆమె అమలాపురంలోని కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలు పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.

రైతుల అభివృద్ధికి సహకార సంఘాలు

విశాలాంధ్ర - దేవరపల్లి : రైతుల అభివృద్ధికి సహకార సంఘాలు ఎంతో దోహదపడతాయని ఎంపీపీ దుర్గారావు అన్నారు. దేవరపల్లి సొసైటీ వద్ద సహకార వారోత్సవాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశానికి సొసైటీ అధ్యక్షుడు కవల శ్రీనివాస్ అధ్యక్షతన సోమవారం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న ఎంపీపీ కేవీకే దుర్గారావు మాట్లాడుతూ వాణిజ్య బ్యాంకుల కన్నా ముందుగానే సహకార సంఘాల రైతులక సేవలందిస్తున్నారన్నారు. ప్రస్తుతం సహకార సంఘాలు కూడా సహకార వాణిజ్య బ్యాంకులకు దీటుగా పనిచేస్తున్నా యన్నారు. సహకార సంఘాల్లో లాభాలు 5 శాతం సంక్షేమ కార్యక్రమాలు సహకార సంఘాలు ఉపయోగిస్తున్నాయన్నారు. దేవరపల్లి సొసైటీ పరిధిలో అచ్చిపాలెం, బుచ్చిపాలెం, కొత్తగూడెం, రామన్నపాలెం, సుబ్బరాయపురం గ్రామాల్లో గల ప్రభుత్వ పాఠశాలలో ఉత్తమ విద్యార్థులకు నగదును ఆయన అందజేశారు. సొసైటీ కార్యదర్శి అన్న సొసైటీ ప్రగతిని వివరించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షుడు సాదే సుబ్బారావు, ఎంపీటీసీలు కె. శివమణి, పి.రామలక్ష్మి, సొసైటీ త్రిసభ్య కమిటీ సభ్యులు మంచిలి కటాక్షం, బాలగంగాధర్ వైసీపీ నేతలు పచ్చ రాంగోపాల్, డి. గంగాధర్, కామిశెట్టి దుర్గారావు, సొసైటీ పరిధిలోని 15 పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు సొసైటీ సిబ్బంది పీ రాధాకృష్ణ జి. వెంకటేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.

వృథాగా పోతున్న నీరు : పట్టించుకునే వారేరీ?

విశాలాంధ్ర - ప్రత్తిపాడు : కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం శరభవరం గ్రామంలో వృథాగా నీరు పోతున్నా పట్టించుకునేవారులేరు. గ్రామానికి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న బోరు నుండి త్రాగునీరు పైపు లైన్ ద్వారా వచ్చి శరభవరంలో ఏర్పరచిన వాటర్ ట్యాంక్‌కు చేరుతుంది. చేరిన నీరు కాస్తా వాటర్ ట్యాంక్ నుండి బయటకు వచ్చి రోడ్డు వెంబడి నిత్యం పారుతుంది. నీరు నిత్యం వెళ్లడంతో రోడ్లు పాడవుతున్నాయి. ఇటీవలే నిర్మించిన తారు రోడ్డుపై నీరు ప్రవహిస్తూ వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఇళ్ల స్థలాల అక్రమాలపై జనసేన సోషల్ ఆడిట్

విశాలాంధ్ర - కాట్రేనికోన : జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ పిలుపుమేరకు జగనన్న ఇల్లు-పేదలందరికీ కన్నీళ్లు కార్యక్రమంలో భాగంగామూడో రోజు సోమవారం గ్రామ సచివాలయాలలో సోషల్ ఆడిట్ చేపట్టారు. జనసేన పార్టీ పీఏసీ సభ్యులు, ముమ్మిడివరం నియోజకవర్గ ఇన్‌చార్జి పితాని బాలకృష్ణ ఆధ్వర్యంలో మండలంలోని చెయ్యేరు, లక్ష్మీవాడ, కాట్రేనికోన, గెద్దనాపల్లి, ఉప్పూడి, దొంతుకూరు కందికుప్ప పల్లంకూరు గ్రామ సచివాలయాలలో ఇళ్ల స్థలాలకు సంబంధించిన లబ్ధిదారులు వివరాలు, స్థలాలు ఎంత మొత్తం ధరకు ప్రభుత్వం కొనుగోలు చేసిందో గ్రామ సచివాలయాల్లో అడిగి సేకరించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ మండల కన్వీనర్ మోకా బాల ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

పిల్లల్లో సృజనాత్మకతను వెలికితీయాలి

జిల్లా కలెక్టర్ మాధవీలత, ఎంపీ మార్గాని భరత్

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం : పిల్లల్లో ఉన్న సృనాత్మకతను గుర్తించి ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు తగిన విధంగా ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ కె. మాధవీలత, ఎంపి మార్గని భరత్ రామ్ అన్నారు. సోమవారం స్థానిక శ్రీ వేంకటేశ్వర ఆనం కళా కేంద్రంలో జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన బాలల దినోత్సవంకు ముఖ్య అతిథిగా స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు హాజరయ్యారు. తొలుత దేశ ప్రథమ ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ, ప్రతి స్కూల్ లోనూ పిల్లలకు ఆటపాటలు, క్రీడలను నిర్వహించి వారిలో ఆలోచన కలుగచేసే విధంగా ప్రేరణ కలుగ జేయాలని స్పష్టం చేశారు. నేడు సాంకేతిక పరంగా ఎంత అభివృద్ధి అయినా క్రీడలు, విజ్ఞానం పట్ల ఆసక్తి పెంచుకోవాలన్నారు. ఒక గంట పుస్తక పఠనం పట్ల ఆసక్తి చూపని పిల్లలు గంటల గంటలు సెల్ ఫోన్లు, టివి లకు అతుక్కుని పోతుండడం చూస్తున్నా మన్నారు. పిల్లలు కొద్దిపాటి శ్రద్ధ పెట్టగలిగితే అద్భుతాలు సృష్టిస్తారని మాధవీలత పేర్కొన్నారు. ముఖ్య అతిథి, పార్లమెంట్ సభ్యులు మార్గాని భరత్ రామ్ మాట్లాడుతూ ఆట పాటలతో పిల్లలలో వ్యక్తిత్వ వికాసం పెంపొందుతుందని అన్నారు. ఎమ్మెల్యే జక్కంపూడి రాజా మాట్లా డుతూ, పిల్లలు చిన్నప్పటి నుంచి క్విజ్, వ్యాస రచన పోటీలలో పాల్గొని వారిలోని సృజనాత్మక తను పెంపొందించు కోవలసి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా పిల్లలు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను అలరిం చాయి. అనంతరం వివిధ పోటీల్లో పాల్గొని విజేతలైన పిల్లలకు బహుమతి ప్రదానం ముఖ్య అతిథులు చేతుల మీదుగా అందచేశారు. ఈ వేడుకల్లో మునిసిపల్ కమిషనర్ కె. దినేష్ కుమార్, జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారి కె. విజయ కుమారి, డిఈఓ ఎస్ అబ్రహం, చైల్డ్ లైన్ కో ఆర్డినేటర్ బి. శ్రీనివాస రావు, డిప్యూటీ ఇన్స్పెక్టర్ దిలీప్ కుమార్, వరల్డ్ విజన్ కో ఆర్డినేటర్, పుల్లయ్య, భూమిక హెల్ప్ లైన్ కౌన్సిలర్, అప్పాయమ్మ, ఎన్. శ్రీనివాస్, పలు స్కూల్స్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

26న చలో రాజమండ్రి జయప్రదం చేయండి

విశాలాంధ్ర - కాకినాడ : ఈ నెల 26 నుండి 28 వరకు రాజమండ్రిలో అఖిల భారత భవన నిర్మాణ కార్మిక సంఘం (ఏఐటీయూసీ అనుబంధం) జాతీయ మహాసభలు జరుగుతున్న సందర్భంగా 26న ఛలో రాజమండ్రికి కార్మికులు తరలి రావాలని బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు తాటిపాక మధు పిలుపు నిచ్చారు. సోమవారం పిఆర్ భవన్‌లో యూనియన్ సమావేశం తోకల ప్రసాద్ అధ్యక్షతన జరిగింది. ముందుగా మధు మాట్లాడుతూ దేశంలో నిర్మాణ రంగం చాల సంక్షోభంలో ఉందని అన్నారు. పాలకుల విధానాల వల్ల ఇసుక కొరత, స్టీల్, సిమెంట్ ధరలు ఆకాశాన్ని అంటుకున్నాయని దీనితో నిర్మాణ రంగం కార్మికులు రోడ్డున పడ్డారని అన్నారు. 26వ తేదీ ఉదయం 10 గంటలకు మున్సిపల్ స్టేడియం నుండి ప్రదర్శన ప్రారంభం అవుతుందని కంబాల చెరువు సెంటర్ వద్ద బహిరంగ సభ జరుగుతుందని అన్నారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా కోశాధి కారి కె. బోడకొండ, బిటిసి జిల్లా కన్వీనర్ పీస్ నారాయణ, సత్యనారాయణ, పప్పు ఆదినారాయణ, అన్నవరం, అప్పలరాజు తదితరులు ప్రసంగించారు.

పైసలిస్తేనే పనులు

విద్యుత్ లైన్ల మార్పునకు రూ.10 వేలు డిమాండ్

గొల్లపుంత కాలనీలో దర్జాగా దోపిడీ

విశాలాంధ్ర - మండపేట: మండపేట విద్యుత్ శాఖ కార్యాలయంలో భారీ అవినీతి అక్రమాలు జరుగుతున్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. సిబ్బందికి పైసలు ఇస్తేనే గానీ ఏ పనీ కావడం లేదని వినియోగదారులు వాపోతున్నారు. విద్యుత్ సమస్యలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం కాల్ సెంటర్ను ఏర్పాటు చేసింది. అందులో వినియోగదారులు తమ విద్యుత్ సమస్యలను ఫోన్ ద్వారా గానీ మారేడుబాకలో ఉన్న విద్యుత్ కార్యాలయానికి గానీ నేరుగా వెళ్ళి సమస్యను ముందుగా ఫిర్యాదు చేయాలి. సమస్యను బట్టి నిర్ణీత సమయంలో సమస్యను పరిష్కరించాలి. అవన్నీ ప్రభుత్వ లెక్కలు మాత్రమే. ఆ నిబంధనలు ఏమీ ఇక్కడ అమలు కావు. వీరు పెట్టిన రూల్సే అమలవుతాయి. పైస లిస్తేనే పనులవుతాయి. ఈ నేపథ్యంలో విద్యుత్ శాఖలో పని చేసే కొంతమంది ఉద్యోగులు ప్రతీ పనికీ ఓ రేటు ఫిక్స్ చేసినట్టు తెలుస్తున్నది. ఏ పనికి ఎంతెంత అవుతుందనేది వారే నిర్ణయిస్తారు. వారు ఎంత చెబితే అంత ముట్ట జెప్పాల్సిందే. గొల్లపుంత కాలనీలో పరిస్థితులు మరీ దారుణంగా ఉన్నాయని బాధితులు వాపోతున్నారు. ఆ కాలనీలో ఇళ్లకు వేసిన మీటర్ల దగ్గర నుండి విద్యుత్ వైర్ల మార్పిడితో సహా ముడుపులు ఇస్తే ఎంతటి పనైనా ఇట్టే అయిపోతుంది. కాలనీలోని ఇళ్లను ఆనుకుని విద్యుత్ లైన్లు ఉన్నాయి. ప్రమాద భరితంగా ఉన్న చోట వీటికి యాంగ్యులర్ ఏర్పరిచి మూడు అడుగుల దూరం జరుపుకునేందుకు ఇంటి యజమానులు ప్రయత్నిస్తున్నారు. సమస్య తీవ్రతను బట్టి ఉన్నతాధికారులు పరిష్కరించి చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. 10,000 ఇస్తే ఇంటిపై వైర్లను సిబ్బంది జరిపేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కాలనీ మీదుగా మెయిన్ లైన్ కూడా వెళ్తోంది. మార్చాల్సిన వైర్లు మెయిన్ లైనా కాలనీ లైనా అనే పనిని బట్టి 10 వేల రూపాయల నుంచి 30వేల వరకు వసూలు చేస్తున్నారని అంటున్నారు. పైసలు ఇవ్వకపోతే పనులు జరగడం లేదంటున్నారు. ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని ఇక్కడ వేళ్ళూనుకున్న అవినీతిపై చర్యలు తీసుకోవాలని వినియోగదారులు కోరుతున్నారు.

సిరిగలపల్లిలంకలో విషజ్వరాలు

విశాలాంధ్ర - కరప : కరప మండలం వేములవాడ గ్రామం శివారు సిరిగలపల్లి లంకలో విష జ్వరాలు విజృంభించి తీవ్రఇబ్బం దులు పడుతున్నామని ప్రజలు మాజీమంత్రి కురసాల కన్నబాబుకు తెలిపారు. ఈసందర్భంగా కన్నబాబు వెంటనే జిల్లా వైద్యాధికారితో ఫోన్లో మాట్లాడి తక్షణమే వైద్య సహాయం అందించాలని కోరారు. పంచాయితీ అధికారులు పారిశుధ్యం పై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కార్యదర్శి వీరభద్రరావుకు ఆదేశాలిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపి శ్రీలక్ష్మి సత్తిబాబు, సర్పంచ్ మంగాదేవి శంకర్, తాతాజీ, అప్పనపల్లి పెద్ద, తదితర నాయకులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

విశాలాంధ్ర - సీతానగరం : విద్యుదా ఘాతంతో వ్యక్తి మృతి చెందాడు. స్థాని కులు తెలిపిన వివరాలు ప్రకారం మండ లంలోని పురుషోత్తపట్నం పంచాయతీ రామచంద్ర పురం గ్రామంలో గల జగనన్న ఇళ్ల స్థలాలలో సోమవారం జార్కండ్ రాష్ట్రానికి చెందిన హరీష్ (40) అనే కాంట్రాక్ట్ కార్మికుడు విద్యుత్ స్తంభం పై పని చేస్తుండగా ఒక్క సారిగా విద్యుత్ రావడంతో విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మరణించాడు. స్తంభంపై పనిచేస్తున్న ఇంకో వ్యక్తికి కూడా స్వల్పంగా గాయాలు కావడంతో ట్రాక్టర్ పై ఆసుపత్రికి తరలించారు. విద్యుత్ స్తంభం పై పని చేస్తుండగా విద్యుత్ రావడం ఏమిటని, అధికారుల నిర్లక్ష్యం వలన నిండు ప్రాణం పోయిందని స్థానికులు తీవ్రంగా విమర్శించారు. ఎస్ఐ శుభ శేఖర్ సంఘటన తెలియగానే హుటాహుటిన అక్కడకు చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభం

విశాలాంధ్ర - కాకినాడ : తూర్పుగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో కాకినాడ గాంధీ నగర్ శాఖ గ్రంథాలయంలో 55వ జాతీయ గ్రంథాలయ వారోత్స వాలను సోమవారం కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్. ఇలక్కియ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ కె. రమేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ పుస్తక పఠనం చేయటం వలన విద్యార్థులు విజ్ఞానవంతులు కావచ్చునని తెలిపారు. స్థానిక వివేకానంద పార్కులో నిర్వహిస్తున్న గాంధీనగర్ శాఖా గ్రంథాలయంలో పోటీ పరీక్షల పుస్తకములను నిరుద్యోగ యువతీ యువకులకు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. లైబ్రేరియన్ ములంపాక శ్రీనివాసరావు మాట్లాడుతూ గాంధీనగర్ శాఖ గ్రంథాలయంలో సుమారు 25,000 వివిధ రకముల పుస్తకములు ఉన్నాయని వాటిని అందరూ ఉపయోగించుకోవాలని తెలిపారు. గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా నిర్వహించే వ్యాసరచన, చిత్రలేఖనం, వక్తృత్వం తదితర పోటీల్లో పాఠశాల విద్యార్థులు పాల్గొనాలని కోరారు.

పురపాలనపై అసిస్టెంట్ కలెక్టర్ అధ్యయనం

-కమిషనర్‌తో పాటు పలు ప్రాంతాల్లో పర్యటన

విశాలాంధ్ర - కాకినాడ : అసిస్టెంట్ కలెక్టర్ ప్రకార్ జైన్ శిక్షణలో భాగంగా సోమవారం కాకినాడ నగరంలో పర్యటించారు. నగరపాలక సంస్థ కమీషనర్ కె.రమేష్‌తో పాటు పలు ప్రాంతాలను సందర్శించారు. పాలనాపరమైన అంశాలతో పాటు వివిధ అభివృద్ధి పనులకు సంబంధించి చేపట్టిన సంస్కరణలను పరిశీలించారు. ఇందులో భాగంగా రామారావుపేట ప్రాంతంలో తడి - పొడి చెత్త సేకరణ తీరును పరిశీలించారు. ఘన, వ్యర్థ పదార్థాల నిర్వహణ కేంద్రంలో తడి చెత్తను ఎరువుగా మార్చడం, పొడి చెత్తను ప్రాసెసింగ్‌కు తరలించే ప్రక్రియను అడిగి తెలుసుకున్నారు. నగరపాలక సంస్థ సాధారణ పరిపాలనా విభాగాన్ని కూడా ఆయన అధ్యయనం చేసారు.

ఉత్సాహంగా ప్రారంభమైన ప్రాంతీయ పాలీటెక్ ఫెస్ట్‌లు

24 నుండి విజయవాడలో రాష్ట్ర స్థాయి ప్రదర్శనలు

విశాలాంధ్ర - కాకినాడ : రాష్ట్రస్థాయి పాలీ టెక్ ఫెస్ట్‌కు విద్యార్థులను సన్నద్ధం చేసే క్రమంలో వివిధ జిల్లాలలో రెండు రోజుల పాటు నిర్వహించే ప్రాంతీయ పాలిటెక్ ఫెస్ట్‌లు సోమవారం ప్రారంభం అయ్యాయని సాంకేతిక విద్యాశాఖ సంచాలకురాలు చదలవాడ నాగరాణి తెలిపారు. ఉమ్మడి కర్నూలు, కృష్ణా, తూర్పు గోదావరి జిల్లాల పరిధిలో ఇవి ప్రారంభం కాగా రాష్ట్రంలోని అన్ని జిల్లాలలో గురువారం వరకు ఇవి జరగనున్నాయన్నారు. కర్నూలు కెవి సుబ్బారెడ్డి ఇన్ స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో 54, గన్నవరం డిజెఆర్ పాలిటెక్నిక్‌లో 98, సూరంపాలెం ఆదిత్యా పాలిటెక్నిక్‌లో వందకు పైగా ఔత్సాహిక అంశాలను విద్యార్థులు ప్రదర్శించారన్నారు. కాకినాడ జిల్లా సూరంపాలెంలో నిర్వహించిన ప్రాంతీయ టెక్ ఫెస్ట్‌లో స్వయంగా పాల్గొన్న నాగరాణి స్థానికంగా మీడియాతో మాట్లాడారు. మంగళవారం పశ్చిమ గోదావరి, బుధవారం శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, కడప, అనంతపురం, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు ఉమ్మడి జిల్లాల పరిధిలో ప్రాంతీయ టెక్ ఫెస్ట్‌లు ప్రారంభం అవుతాయన్నారు. విద్యార్థుల భవిష్య త్తుకు మార్గం చూపేలా విజయవాడ ఎస్ఎస్ కన్వెన్షన్ వేదికగా రాష్ట్ర స్థాయి పాలీ టెక్ ఫెస్ట్ 2022ను నవంబర్ 24 నుండి 26 వరకు మూడు రోజులు నిర్వహిస్తున్నా మన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన ప్రతి అంశాన్ని నిశితంగా పరిశీలించిన నాగరాణి ప్రతి ప్రాజెక్టుకు సంబంధించి పూర్తి వివరాలు తెలుసుకున్నారు.

కాకినాడ కెమెరాక్లబ్ నూతన కార్యవర్గం

విశాలాంధ్ర - కాకినాడ : స్థానిక గాంధీభవన్‌లో కాకినాడ కెమెరా క్లబ్ సర్వసభ్య సమావేశం ఘనంగా నిర్వహించారు. తొలుత ఇటీవల మృతిచెందిన క్లబ్‌సభ్యులు కేవీఎస్ఎస్ ప్రసాద్, కె.పేర్రాజు, పి.వి.వి. సత్యనారాయణ, సి.ప్రభాకర్‌ల మృతిపట్ల సంతాపం వ్యక్తం చేశారు. అనంతరం జాకబ్ లూయిస్ మాండ్ డ్యాగురే చిత్రపటానికి పూలమాలవేసి అంజలి ఘటించారు. క్లబ్ సభ్యులకు పిక్టోరియల్ ఫోటోగ్రఫీపై శివరామారావు స్లైడ్‌షోద్వారా వివరించారు. స్టిల్‌ఫోటోగ్రఫీ, లైఫ్‌ఫోటోగ్రఫీపై కొర్లపాటి సరస్వతిరావు తెలియచేశారు. అనంతరం క్లబ్ సీనియర్ సభ్యుడు ఎస్.బాబూరావు కార్యవర్గాన్ని ప్రతిపాదించగా సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. అధ్యక్షునిగా ఎస్.వి.ఎస్.ఎస్.రామ్మూర్తి, ఉపాధ్యక్షునిగా ఆర్.వి.ఎస్.రామకృష్ణ, కార్య దర్శిగా కె.నాగేశ్వరరావు, ఉపకార్యదర్శిగా జి.జె.వి.ఎస్.వి.ప్రసాద్, కోశాధి కారిగా ఎం.సోమరాజు, టెక్నికల్ ఫ్యాకల్టీ లుగా కొర్లపాటి సరస్వతిరావు, తుమ్మలపల్లి వీరభద్రరావు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో బి.జగన్నాధం, తోట సూర్యసుబ్బారావు, కె.కుమార స్వామి, వినయవిలాస్ టాల్కర్, సలాది కృష్ణ, ఎస్.ఆర్.వి.రెడ్డినాయుడు, పుష్పభానుడు, పి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సహకార స్ఫూర్తితో కేసీబీఎస్ సేవలు

విశాలాంధ్ర - కాకినాడ : సహకార రంగంలో ఏర్పాటైన కేసీబీఎస్ సంస్థ సమర్థవంతమైన సేవలతో శతాబ్ది ఉత్సవాలు జరుపుకోవడం స్ఫూర్తిదాయక'మని జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఛైర్మన్ ఆకుల వీర్రాజు పేర్కొన్నారు. ది కాకినాడ కోఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీ కార్యాలయంలో సోమవారం సహకార వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా తొలుత సంస్థ అధ్యక్షుడు కోసూరి శ్రీనివాస సత్యనారాయణమూర్తి, ఉపాధ్యక్షుడు రెడ్డి రాజేంద్రకుమార్, కార్యదర్శి ముమ్మిడి గోవిందు, డైరెక్టర్లు సహకార పతాకాన్ని ఆవిష్కరించారు. శతాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని ఇటీవల నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ, డ్రాయింగ్ పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. అక్షయపాత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో కాకినాడ ప్రభుత్వాస్పత్రిలో సుమారు 500 మంది రోగులు, వారి బంధువులకు భోజన వితరణ చేశారు. ఈ సందర్భంగా సంస్థ ప్రధాన కార్యాలయంలో జరిగిన సహకార వారోత్సవాలు ప్రారంభ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన డీసీసీబీ ఛైర్మన్ ఆకుల వీర్రాజు మాట్లాడుతూ నిరుపేదలు కూడా ఇళ్ళ నిర్మాణం చేపట్టేలా మంచి సదాశయంతో ఏర్పాటైన సంస్థ సమర్థవంతమైన సేవలు అందిస్తోందని ప్రశంసించారు. కేసిబిఎస్ అధ్యక్షుడు కోసూరి శ్రీనివాస సత్యనారాయణమూర్తి, సంస్థ ఉపాధ్యక్షుడు రెడ్డి వీర రాజేంద్రకుమార్ మాట్లాడుతూ వ్యవస్థాపకుల ఆశయాలకు అనుగుణంగా సహకార స్ఫూర్తితో మరిన్ని సేవలు అందిస్తామన్నారు. మేనేజర్ చీమలకొండ గంగాధరం కేసీబీఎస్ అందిస్తోన్న సేవలను వివరించారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి సీఈవో ఆర్‌వి నరసింహారావు, డీజీఎం త్రినాథ్, రామదాసు, తదితరులు పాల్గొన్నారు.

కోతుల నుంచి పంటలను కాపాడుకునేందుకు శిక్షణ

విశాలాంధ్ర-రాజవొమ్మంగి: రాజవొమ్మంగి మండలం సింగంపల్లి గ్రామంలో సోమవారం మార్టేరు వరిపరిశోధన కేంద్రానికి చెందిన, సైంటిస్టులు ఎన్. శ్రీనివాసరావు, సిహెచ్ శ్రీనివాస్‌లు పంటలను కోతులు, ఇతర జంతువుల నుండి రక్షించుకునే విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. కేవలం 20వేల రూపాయలతో 5ఎకరాల నుండి 8ఎకరాల పంటలకు ఫెన్సింగ్ వేసి, కోతులను అడవిపందులు,పశువులు నుండి పంటలను రక్షించుకోవచ్చునని తెలిపారు భూసార పరీక్షలు చేసి పంటలకు కావలసిన ఎరువులు ఏవిధంగా వాడాలో తెలియజేశారు. ఖరీఫ్, రబి సాగులలో వచ్చే తెగుళ్లు, వాటిని నివారించే పద్ధతులను తెలియజేసారు, అనంతరం ఆనంత నాగరాజు క్షేత్రంలో ఏర్పాటు చేసిన సోలార్ ఫెన్సింగ్ పనితీరును రైతులకు చూపించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రమేష్ నాయుడు, జడ్డంగి సర్పంచ్ కొంగరి మురళీకృష్ణ, వ్యవసాయ సలహామండలి సభ్యులు చీడిపల్లి అప్పారావు, పలు గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

గడపకు గడపకు మన ప్రభుత్వం

విశాలాంధ్ర-రాజవొమ్మంగి: రాజవొమ్మంగి మండలం తంటికొండ పంచాయతీలో గల సింగంపల్లి,వట్టిగెడ్డ, గింజర్తి,తంటికొండ, డి మల్లవరం గ్రామాలలో ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి ఇంటింటికి మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆమె గ్రామస్తులతో మాట్లాడుతూ జగనన్న ప్రవేశ పెట్టిన పథకాలను వివరించి అర్హులైన వారికి సంబంధిత పథకాలు అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. కొంతమంది ప్రజలు పెన్షన్లు రాలేదని తెలపడంతో వారికి వెంటనే వచ్చేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆమె వెంట జెడ్పీటీసీ వడుగుల జ్యోతి,ఎంపీపీ గోము వెంకటలక్ష్మి, సొసైటీ అధ్యక్షుడు సింగిరెడ్డి రామకృష్ణ, ఎంపీటీసీలు, సర్పంచ్ లు, మండల అధికారులు పాల్గొన్నారు.

ఎన్‌కౌంటర్‌లో సాధారణ కూలీలను హత్య చేశారు

-ఘటనపై తక్షణమే నిజనిర్ధారణ చేయాలి

- దోషులను కఠినంగా శిక్షించాలి

-18న మల్కనగిరి, కొరాపుట్ జిల్లాల బంద్‌ను జయప్రదం చేయండి

-మావోయిస్టు పార్టీ మల్కన్‌గిరి-కొరాపుట్ బోర్డర్ డివిజన్ కమిటీ పిలుపు

విశాలాంధ్ర-చింతూరు : అల్లూరి సీతారామరాజు జిల్లా సరిహద్దున గల ఒడిశా రాష్ట్రంలోని బ్యెపరిగూడ బ్లాక్, బదిలిపార వద్ద 10వ తేదీన జరిగిన బూటకపు ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు సాధారణ కూలీలను పోలీసులు హత్య చేశారని, ఈ సంఘటనపై తక్షణమే నిజనిర్ధారణ చేయాలని మావోయిస్టు పార్టీ మల్కన్‌గిరి-కొరాపుట్ బోర్డర్ డివిజన్ కమిటీ కార్యదర్శి రాకేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు డివిజన్ కమిటీ కార్యదర్శి పేరుతో రాకేష్ ఓ ప్రకటనను మీడియాకు విడుదల చేశారు. ఈ సందర్భంగా రాకేష్ మాట్లాడుతూ 10వ తేదీన బ్యెపరగూడ బ్లాక్‌లో అటల్ గూడ, మాలిపాదర్, బదిలిపార గ్రామాల మధ్య అటవీ ప్రాంతానికి "కూంబింగ్ వెళ్ళిన ఎజ్జీ పోలీసులపై అర్ధరాత్రి ముందుగా మావోయిస్టులు కాల్పులు జరిపారని ఆ తర్వాత పోలీసులు జరిపిన కాల్పుల్లో ఇద్దరు మావోయిస్టులు చనిపోయారనీ, ఘటనా స్థలంలో మూడు కేఫ్ తుపాకులు, తూటాలు, మావోయిస్టుల దుస్తులు, సాహిత్యం, మ్యాక్, వంటపాత్రలు, గంజాయి మూటలు దొరికాయని" ఫొటోలు, వీడియోలతో పోలీసు అధికారులు అబద్ధపు ప్రకటనలు ఇచ్చారని పేర్కొన్నారు. పైగా 'మావోయిస్టులైతే అక్కడ గంజాయి ఎందుకుంది? అని విలేఖరులు అడిగిన ప్రశ్నలకు మావోయిస్టులకు గంజాయి వ్యాపారులతో సంబంధాలు ఉన్నాయని, వారితో కలిసి ఉన్నప్పుడు ఈ ఘటన జరిగిందని నిస్సిగ్గుగా అసత్యాలు మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వాస్తవానికి అక్కడ మావోయిస్టులెవరూ లేరని, అక్కడ చనిపోయినవాళ్ళలో మథిలి బ్లాక్ సరగిగూడ గ్రామానికి చెందిన ధోనో కమరోపాటు, మరొక సాధారణ కూలీ ఉన్నాడని ఆయన తెలిపారు. వీరు తమ బ్రతుకుదెరువు కోసం గంజాయి వ్యాపారుల వద్ద కూలీ కోసం రాత్రీపగలూ అటవీ మార్గాల్లో ఎన్నో రిస్కులను భరిస్తూ, గంజాయి మూటలను తరలించే సాధారణ పేద కూలీలని, రాత్రిపూట మార్గమధ్యలో, అడవిలో మకాంలు వేస్తుంటారని వివరించారు. వీరిపైన పోలీసులు విచక్షణారహితంగా కాల్పులు జరిపి, హత్య చేసి తమ తప్పిదాన్ని కప్పిపుచ్చుకోవడం కోసం మావోయిస్టులపై కాల్పులు జరిపామని బూటకపు ప్రచారం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. బదిలీపార ఘటనకు నిరసనగా నవంబర్ 18వ తేదీన 'మల్కన్‌గిరి, కొరాపుట్ జిల్లాల బంద్'ను పాటించాల్సిందిగా ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు.

గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభం

విశాలాంధ్ర-కూనవరం : కూనవరం శాఖ గ్రంథాలయంలో 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు స్థానిక ఎంపీటీసీ కొమ్మాని అనంతలక్ష్మి స్థానిక వైద్యులు దుద్దుకూరి వెంకయ్య ప్రారంభించారు. ఉపాధ్యా యులు విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని నెహ్రూ చిత్రపటానికి పూలమలలు వేసి నివాళులర్పించారు. సామాజిక మాధ్యమాలు విస్తృతంగా వ్యాపించిన ఈ తరంలో కూడా పుస్తకాలకున్న ప్రత్యేకత మరి దేనికి రాదని పుస్తక పఠనం మనిషిని పరిపూర్ణ విజ్ఞానవంతునిగా తీర్చిదిద్దుతాయని వక్తలు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ పాలకులు ఎం. గోవిందరాజులు, సహాయ సిబ్బంది నాగరాజు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కూనవరం పీహెచ్‌సీలో వైద్య పరీక్షలు

విశాలాంధ్ర-కూనవరం : కూనవరం పీహెచ్‌సీ పరిధిలోని జగ్గవరం సచివాలయంలో డాక్టర్ వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లో జ్వరాలతో బాధపడుతున్న గర్భిణీలకు కూనవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ పి.గౌతమి వైద్య పరీక్షలు నిర్వహించారు.గర్భిణీ లు తీసుకోవలసిన ఆరోగ్య జాగ్రత్తలపై, పౌష్టికాహారం పై అవగాహన కల్పించారు. వైద్య పరీక్షల అనంతరం మందులు అందజేశారు. పరిసరాల శుభ్రత, వ్యక్తిగత శుభ్రత పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌వీ భద్రకాళి, సచివాలయ ఏఎన్ఎం సుజాత, హెల్త్ అసిస్టెంట్ వెంకటేశ్వర్లు ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఘనంగా నెహ్రూ జయంతి వేడుకలు

విశాలాంధ్ర-ఎటపాక : ఏటపాక మండలంలోని చింతల చెరువు పాఠశాలలో చాచానెహ్రూ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయురాలు పుల్లమ్మ మాట్లాడుతూ చాచా నెహ్రూకు చిన్నారులంటే చాలా ఇష్టమని, అందుకే చిన్నారులకు స్వీట్లు, చాక్లెట్లు పంచిపెట్టామన్నారు. ఆయన సేవలు మరువలేని వని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉపద్యుడు రాజు, పాల్గొన్నారు.

వి.ఆర్.పురంలో: అల్లూరి సీతారామరాజు జిల్లా మండల కేంద్రం రేఖపల్లిలోని ఏ ఎస్ డి ఎస్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ గాంధీ బాబు ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా బాలల దినోత్సవం నిర్వహించారు. చింతూరు సబ్ కలెక్టర్ అహ్మద్ ఖాన్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు ఈ సందర్భంగా సబ్ కలెక్టర్, ఎంపీడీవో ఫణీంద్ర తాసిల్దార్ ఎన్ శ్రీధర్ సంస్థ డైరెక్టర్ గాంధీ బాబు, ప్రజా ప్రతినిధులు కలసి గిరిజన సాంప్రదాయ నృత్యంలో పాల్గొని ఆటపాటలతో అలరించారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, మహిళలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఆదిత్య స్కూల్‌లో బాలల దినోత్సవం

విశాలాంధ్ర-ఎటపాక : మండల పరిధిలోని శ్రీ ఆదిత్య స్కూల్ లో బాలల దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని గత నాలుగు రోజులుగా క్రీడలు నిర్వహించినట్లు పాఠశాల డైరెక్టర్ వెంకట్ తెలిపారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ యువత లో పట్టుదల ఉంటే ఎంతటి కష్టతరమైన లక్ష్యమైనా ఛేదించవచ్చన్నారు. క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ వెంకట్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, తల్లిదండ్రులు తది తరులు పాల్గొన్నారు.

మధుమేహ వ్యాధి నిర్ధారణ పరీక్షలు

విశాలాంధ్ర - ఏలూరు : లయన్స్ జిల్లా 316 జి, నగరంలోని విభిన్న వాకర్స్ అసోసియేషన్ ల ఆధ్వర్యంలో పత్తేబాద బృందావన్ పార్క్‌లో లయన్స్ క్లబ్ జిల్లా చైర్ పర్సన్ డాక్టర్ ఎం ఎల్ వి ప్రసాద్ అధ్యక్షతన అవగాహన, వ్యాధి నిర్ధారణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన లయన్స్ జిల్లా గవర్నర్ డాక్టర్ వీకే పంకజాక్షన్ మాట్లాడుతూ మధుమేహం వ్యాధి కాదని శరీరంలో సమతుల్యత లోపం వలన సంభవించే దుష్పరిణామాలని, ప్రజలందరూ మధుమేహ వ్యాధి పట్ల అవగాహన కలిగి ఉండాలని ,ఆహారపు అలవాట్లను క్రమబద్ధీకరించుకోవాలన్నారు. మధుమేహ వ్యాధి పై అవగాహన కలిగించడానికి విచ్చేసిన డాక్టర్ పృథ్వి నరేష్ మాట్లాడుతూ డయాబెటిస్ రెండు విధాలుగా ఉంటుందని , టైప్ వన్ డయాబెటిస్ ముఖ్యంగా చిన్నపిల్లల్లో కనిపిస్తుందని, టైప్ టు డయాబెటిస్ పెద్దవారిలో సంభవిస్తుంద న్నారు. ఎప్పటికప్పుడు పరీక్షలు చేయించుకుంటూ మూడు నెలలకు ఒకసారి హెచ్ బి ఏ వన్ సి పరీక్ష చేయించుకుని వ్యాధిని నియంత్రణలో ఉంచుకోవాలన్నారు. ఇంటర్నేషనల్ వాకర్స్ అసోసియేషన్ ఎలెక్ట్ ప్రెసిడెంట్, లయన్స్ జిల్లా పూర్వ గవర్నర్ వల్లూరిపల్లి మురళీమోహన్‌రావు మాట్లాడుతూ వాకర్స్ అసోసియేషన్ ద్వారా త్వరలో డయాబెటిక్ నిర్మూలన కొరకు ప్రత్యేకించి కార్యక్రమాలను ఏర్పాటు చేస్తామని, లయన్స్ క్లబ్ ను కలుపుకొని పలు ఆరోగ్యప రమైన సేవలందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ జిల్లా ద్వితీయ వైస్ గవర్నర్ కాకరాల వేణుబాబు, వాకర్స్ అసోసియేషన్ నాయకులు ఎస్ఎం అక్బర్, వై. సత్యనారాయణ, ఐఎంఆర్ మోహన్ రావు, లయన్స్ జిల్లా క్యాబినెట్ కార్యదర్శి వల్లెపు వెంకటస్వామి, మద్దుకూరి శ్రీహరి, ఆఫీస్ అడ్మినిస్ట్రేటర్ బాలాదిత్య, గ్లోబల్ ఏక్షన్ టీం మార్కెటింగ్ కోఆర్డినేటర్ లేళ్ల వెంకటేశ్వరరావు, డాక్టర్ డి. సుబ్బారావు, జోన్ చైర్ పర్సన్‌లు వి. రత్నకుమార్, ఎం. నాగమల్లేశ్వరరావు, లయన్స్ సభ్యులు ఉమా కిరణ్, విజయరామరాజు, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

గడప గడపకు సంక్షేమ ఫలాలు

విశాలాంధ్ర - కలిదిండి : ముఖ్యమంత్రి జగనన్న గడప గడపకు సంక్షేమ ఫలాలు అందించి మీ ముందుకు తలెత్తుకుని వచ్చే అవకాశాన్ని మాకు కల్పించారని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు అన్నారు. సోమవారం మండలంలోని లోడిద లంక గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఇచ్చిన మాటకు ఖచ్చితంగా నిలబడి స్వచ్ఛమైన పాలనను అందిస్తున్నారని తెలిపారు. ఇంటింటిని సందర్శించి సమస్యల గురించి అడిగి తెలుసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ బొర్రా. సత్యవతి,ఎంపీపీ చందన ఉమామహేశ్వర రావు, వైస్ ఎంపీపీలు కూనంపూడి కనకదుర్గారాణి, కట్టా నాగలక్ష్మి, సర్పంచ్ బండి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

26న చలో విజయవాడను జయప్రదం చేయండి

విశాలాంధ్ర -భీమవరం: రైతు సంఘాల జెఎసి పిలుపులో భాగంగా 26వ తేదీన విజయవాడ ధర్నా చౌక్ లో చేపట్టిన ఆందోళనా కార్యక్రమాలను అనంతరం గవర్నర్ బిష్వభూషణ్ హరిచందన్ కు వినతిపత్రం ఇచ్చే కార్యక్రమాలను యావత్ రైతాంగం జయప్రదం చేయాలని అఖిల భారత అగ్రగామి కిసాన్ సభ రాష్ట్ర అధ్యక్షుడు లంక కృష్ణమూర్తి పిలుపునిచ్చారు. సోమవారం ఆయన భీమవరంలో మీడియాతో మాట్లాడుతూ రైతాంగ సమస్యలను పరిష్కరించడంలో పాలక పక్షాలు వైఫల్యం చెందుతున్నాయని సంఘటిత ఉద్యమాలతో హక్కులు సాధించుకోవాలని చేశారు. రాష్ట్రంలో చేపడుతున్న రీ సర్వే లోపభూయిష్టంగా ఉందని సర్వే వివరాలు రైతులకు తెలపడం లేదని, గ్రామ సభల్లో చర్చించడం లేదని ఆయన విమర్శించారు.

రవిబాబు కుటుంబ సభ్యుల్ని పరామర్శించిన శివరామరాజు

విశాలాంధ్ర - ఉండి : ఇటీవల కాలంలో అధికార పార్టీ వాళ్ళు పెట్టిన అక్రమ కేసులో రిమాండుకు వెళ్లిన నరసాపురం పార్లమెంట్ తెలుగు యువత కార్యనిర్వాహణ కార్యదర్శి బురిడీ రవిబాబు కుటుంబ సభ్యులను పూర్వపు ఎమ్మెల్యే వేటుకూరి వెంకట శివరామరాజు సోమవారం పరా మర్శించారు. ఈ సందర్భంగా శివరామరాజు మాట్లాడుతూ టిడిపిలో క్రియాశీలకంగా పనిచేస్తున్న బురిడి రవిబాబుపై అధికార పార్టీకి చెందిన కొంతమంది నాయకులు అధికార అహంభావంతో పోలీసుల సహాయంతో అత్తమూరులో జరిగిన గొడవకి రవి బాబు కి ఎటువంటి సంబంధం లేకపోయినా రవిబాబుపై నాన్ బెయిల్ బుల్ అక్రమ కేసులు పెట్టించి భీమవరంలోని సబ్ జైల్లో వేయించారని ఇది చాలా బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు జుత్తిగ శ్రీనివాసరావు, కన్ని గంటి రుత్ కల, సీనియర్ నాయకులు కరిమెరక నాగరాజు, దూసనపూడి రాంబాబు, కిన్నెర వెంకన్న, ఆరమిల్లి గంగాధర కుమార్, పాలపర్తి బాలాజీ, కొత్తకోట నాని, పుత్తూరు ఫణి రాజు, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సబ్ స్టేషన్ ముట్టడిని అడ్డుకున్న పోలీసులు



విశాలాంధ్ర - ఉండి : టిడిపి ఆధ్వర్యంలో ఉండి మండలం ఎస్ ఆర్ పి అగ్రహారం లోని కోట్ల ఫంక్షన్ హాల్ వద్ద సోమవారం జరిగిన ఆక్వా రైతుల పోరుబాట కార్యక్రమంలో భాగంగా రైతు కోసం తెలుగుదేశం కార్యక్రమం జరిగింది. ఆక్వా రైతులకు ప్రధాన సమస్య అయిన విద్యుత్ సబ్సిడీ నీ వెంటనే పునరుద్ధరించాలని ఉండి ఎమ్మెల్యే మంతెన రామరాజు, పాలకొల్లు ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు, ఉండి మాజీ ఎమ్మెల్యే వేటుకూరి వెంకట శివరామరాజు, పీతల సుజాత తదితరులు ఉండి భీమవరం రోడ్లో గల 220 కెవి విద్యుత్ సబ్ స్టేషన్ ను ముట్టడించేందుకు వెళ్లిన టిడిపి నాయకులు, కార్యకర్తలు, ఆక్వా రైతులను నర్సాపురం డి.ఎస్.పి వీరాంజనేయరెడ్డి నేతృత్వంలోని పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా పోలీసులకు టిడిపి శ్రేణులకు జరిగిన తోపులాటలో ఆకివీడు పోలీస్ స్టేషన్లో పనిచేసే కానిస్టేబుల్ ఐతం సుబ్బారావు కు కాలు విరిగింది. వెంటనే పోలీసు సిబ్బంది సుబ్బారావును భీమవరంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.

ఆక్వా రైతులకు తీరని అన్యాయం



విశాలాంధ్ర - కొయ్యలగూడెం : రాష్ట్రంలో ఆక్వా రైతులకు తీరని అన్యాయం జరుగుతుందని టిడిపి పోలవరం నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు మొడియం శ్రీనివాస రావు పేర్కొన్నారు. ఉండి నియోజకవర్గం ఉండి పట్టణంలో సోమవారం జరిగిన ఆక్వా రైతుల పోరుబాట కార్యక్రమనికి శ్రీనివాసరావు హాజరయ్యారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆక్వా రైతుల పై రాష్ట్ర ప్రభుత్వం పన్నుల రూపంలో పెనుబారం మోపుతుందని అన్నారు. ఆక్వా రైతులు పెంచే రొయ్యలకు ధర లేకపోవడంతో ఆక్వా రైతులు అనేక ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. ఆక్వా రైతులకు సెస్ బాదుడు, ఆక్వా రైతులకు పరికరాలను అందించకపోవడంతో ఆక్వా రైతులు ఆందోళన చెందుతున్నారని పరిపాలనలో ముఖ్యమంత్రి జగన్ విఫలం చెందారని తెలిపారు. ప్రస్తుత రాష్ట్ర పరిపాలనలో రాష్ట్ర ప్రజలంతా అంధకారంలో జీవిస్తున్నట్లు ఉన్నదని, రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో టిడిపి జెండా విజయకేతనం ఎగరవేస్తుందన్నారు.

తాడేపల్లిగూడెం ఫైర్ ఆఫీసర్ ను శిక్షించాలి

విశాలాంధ్ర -భీమవరం: కులం పేరుతో దూషించిన తాడేపల్లిగూడెం ఫైర్ ఆఫీసర్ జి.వి.రామారావు సిబ్బంది రావూరి సత్యనారాయణ, కె.శ్రీశైలం తదితరులపై ఎస్సీ ఎస్టీ అత్యాచార చట్టం కింద కేసు నమోదు చేసి శిక్షించాలని దళిత ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు గంట సుందర్ కుమార్ డిమాండ్ చేశారు. తాడేపల్లిగూడెం ఘటనను నిరసిస్తూ దోషులను కఠినంగా శిక్షించాలని కోరుతూ దళిత ఐక్య వేదిక సోమవారం కలెక్టరేట్ వద్ద ఆందోళన నిర్వహించి ఆర్డీఓ దాసి రాజు కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా గంట సుందర్ కుమార్ మాట్లాడుతూ తాడేపల్లిగూడెం ఫైర్ స్టేషన్ లో ఫైరుమేన్ గా పనిచేస్తున్న ఏలేటి సాగర్ కులం పేరుతో దూషించడం దారుణమని ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దళిత నాయకులు పాలపర్తి జోనా, పి.సహదేవ్, ఉండ్రు విల్సన్, కె.సి.రాజు, పట్టెం శుభాకర్, గెద్దం జార్జ్, ఆనంద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఐకమత్యంగా ఉంటే అభివృద్ధి సాధ్యం

విశాలాంధ్ర-ఉండి: గ్రామంలో ఐకమత్యంగా ఉంటేనే గ్రామ అభివృద్ధి సాధ్యపడుతుందని డిసిసిబి చైర్మన్, ఉండి నియోజకవర్గ ఇన్చార్జ్ పివిఎల్ నరసింహారాజు అన్నారు. సోమవారం వాండ్రం గ్రామంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నరసింహారాజు మాట్లాడుతూ గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ముగిసిన ప్రతి సచివాలయానికి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రూ.20 లక్షల నిధులు కేటాయించడం జరిగిందని ఆ నిధులతో గ్రామంలోని రామాపురం ప్రాంతంలో నాలుగు గ్రావెల్ రోడ్లను నిర్మించడానికి శంకుస్థాపన చేయడం జరిగిందని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్ పని చేస్తున్నారన్నారు.

ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దాసరి వెంకటకృష్ణ, ప్రముఖ పారిశ్రామికవేత్త ద్వారంపూడి నారాయణరెడ్డి, సత్తి బ్రహ్మారెడ్డి,వైసిపి మండల కన్వీనర్, ఎంపీటీసీ పెన్మెత్స ఆంజనేయరాజు, ఉండి రూరల్ బ్యాంక్ త్రి సభ్య కమిటీ చైర్మన్ పేరిచర్ల సూర్యనారాయణ రాజు, గ్రామ మాజీ సర్పంచ్ రెడ్డిపల్లి సత్యనారాయణ, మునుకోలు సింహాచలం, మత్తె రాజ్ కుమార్, బులుసు రామకృష్ణ (ఆర్కె) బుద్ధరాజు రంగరాజు, యాడంగి ఏసు, కోణాల రాజేంద్రకుమార్, గుండుబోయిన రాంబాబు, మీసాల అప్పల కృష్ణ, ఉప్పలపాటి చంటి రాజు, బుద్ధరాజు శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాల ద్వారా విజ్ఞానాన్ని పెంచుకోవాలి

విశాలాంధ్ర - లింగపాలెం : గ్రంథాలయాలను వినియోగించుకుని విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని లింగపాలెం సర్పంచ్ తగరం హేమలత, ధర్మాజీగూడెం సర్పంచ్ మౌనిక రమేష్ తెలిపారు. ఈ రెండు గ్రామాలలోని గ్రంథాలయాలలో వారోత్సవాలను వీరు ప్రారంభించారు. ఈ సందర్భంగా నెహ్రూ, గ్రంథాలయ స్థాపనకు కృషి చేసిన ఎస్.ఆర్.రంగనాథన్, అయ్యంకి వెంకటరమణ, పాతూరి నాగభూష ణం చిత్రపటాలకు నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయ నిర్వాహకులు లతీఫ్, వెంకటరమణ, ఎంపిటీసి మేకల రాజ్యలక్ష్మి, గ్రంథాలయ కమిటీ సభ్యులు కందుల చిట్టియ్య, బి.ఎస్.ఎన్.ప్రకాష్, ఉపాధ్యాయులు రమేష్ తదితరులు పాల్గొన్నారు. వారం రోజుల పాటు నిర్వహించే ఈ ఉత్సవాలలో మొదటి రోజు బాలలకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు.

మండవల్లిలో: పుస్తక పఠనంతో మేధస్సును పెంపొందించుకోవచ్చని ప్రతి ఒక్కరు గ్రంథాలయాల సేవలను వినియోగించుకుని జీవితంలో ఉన్నత స్థితికి చేరుకోవాలని మండవల్లి గ్రామ సర్పంచ్ మెండా ఝాన్సీ అన్నారు. సోమవారం మండవల్లి శాఖా గ్రంథాలయంలో 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను ఝాన్సీ, స్థానిక పెద్దలు, పాఠకులతో కలిసి ప్రారంభిం చారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థి దశనుండే పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలన్నారు. తొలుత భారత తొలి ప్రధాని నెహ్రూ , గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకటరమణయ్యల చిత్రపటాలకు పూలమాలలు వేసి వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో గ్రంథపాలకురాలు షేక్‌పర్వీన, విశ్రాంత ఉపాధ్యాయులు ఎల్ఎస్ భాస్కరరావు, కె.సూర్యారావు, హైస్కూలు లైబ్రేరియన్ బి.వెంకటరమణ, వైసీపీ నేత మెండా సురేష్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో బాలల దినోత్సవం సందర్భంగా చిన్నారులకు మిఠాయిలు పంపిణీచేశారు.

కామవరపుకోటలో : కామవరపుకోట శాఖా గ్రంథాలయం వారోత్సవాలు సోమవారం స్థానిక గ్రామపంచాయతీ సర్పంచ్ అనూష భాగ్యరాజ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా పండిట్ జవహర్లాల్ నెహ్రూచిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో పాల్గొన్న సీపీఐ మండల కార్యదర్శి టీవీఎస్ రాజు మాట్లాడుతూ సాహిత్యానికి తెలుగు సాహిత్యం అనేక రూపాల్లో తన అస్తిత్వాన్ని నిలబెట్టుకోవడానికి ప్రయత్నం చేస్తున్నదని, వాటిలో చెప్పుకోదగింది బాలల సాహిత్యం అని అన్నారు. ప్రతిరోజు గ్రంథాలయాలు సందర్శించి బాలల సాహిత్యాన్ని అధ్యాయం చేయడం ద్వారా భవిష్యత్తు మేధావులు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో వికలాంగుల సంక్షేమ ప్రతినిధి బి. రాంబాబు, గ్రంథాలయ నాయకురాలు సిహెచ్ వెంకటరమణ, గ్రంథాలయ అధికారి ఎం. భీమరాజు తదితరులు పాల్గొన్నారు.

భీమడోలులో : గ్రంథాలయాలు జ్ఞాన సముపార్జనకు నిలయాలని ఎంపీపీ కనమల రామయ్య, జెడ్పీటీసీ తుమ్మగుంట భవానీ రంగాలు అన్నారు. భీమడోలు శాఖా గ్రంథాలయంలో 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. జ్యోతి ప్రజ్వలనను జెడ్పీటీసీ భవానీ రంగ, ఏఎంసి చైర్మన్ ఇంజేటి నిలిమజునియర్ చేశారు. సీఎం సందేశ పత్రాలను ఎంపీపీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రంథాలయ అభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. పుస్తక ప్రదర్శనను జెడ్పీటీసీ, ఏఎంసిలు ప్రారంభించారు. అనంతరం శతక పద్యాల పోటీలు, వందేమాతరం పూర్తి గేయం పోటీలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సొసైటీ ప్రెసిడెంట్ రావిపాటి సత్య శ్రీనివాస్, సర్పంచ్ పాము మాన్ సింగ్, లైబ్రరీ డెవలప్మెంట్ కమిటీ ప్రెసిడెంట్ తుమ్మల ఉమ మహేశ్వరరావు,గౌరవ ప్రెసిడెంట్ ఆర్. నాగేశ్వరరావు, స్టేట్ బెస్ట్ టీచర్ అవార్డు గ్రహీత మండే సుధాకర్,డైరెక్టర్ నాని, పెద్దలు యర్రంశెట్టి ఏడుకొండలు, సత్రేంద్ర, గ్రందపాలకులు శ్రీనివాస్, టీచర్స్, పిల్లలు పాల్గొన్నారు.

ముదినేపల్లిలో: పోటీ ప్రపంచంలో విజ్ఞానాన్ని గ్రంథాలయాల్లోనే పొంది ఉన్నత స్థానానికి ఎదగాలని జడ్పీటిసి ఈడే వెంకటేశ్వరమ్మ , సర్పంచ్ నిమ్మగడ్డ కైకమ్మ పేర్కొన్నారు.జాతీయ బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని గ్రంథాలయ వారోత్సవాలను ముదినేపల్లి శాఖ గ్రంథాలయంలో ప్రారంభించారు.ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వారం రోజులపాటు నిర్వహించే గ్రంథాలయ వారోత్సవాల్లో వివిధ కార్యక్రమాలు ఏర్పాటు చేయబడతాయని చిత్రలేఖనం , వ్యాసరచనలు , పుస్తక ప్రదర్శనలు , సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయని విద్యార్థులు , పుస్తకప్రియులు , గ్రామస్తులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారిణి ఎం శ్రీదేవి , జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు , ఇండో సాక్సన్ విద్యార్థులు , గ్రంథాలయసిబ్బంది పాల్గొన్నారు.

పెంటపాడులో : గ్రంథాలయాలు విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి దోహదపడతాయని ఎంపీపీ అధ్యక్షురాలు దాసరి హైమావతి పేర్కొన్నారు. మండల కేంద్రమైన పెంట పాడు నక్క మెమోరియల్ గ్రంథాలయంలో బాలల దినోత్సవం పురస్కరించుకుని, 55వ గ్రంథాలయ వారోత్సవాలు గ్రంథాలయం పాలకులు జుల్ఫికర్ ఆలీ,గ్రంధాలయ కమిటీ అధ్యక్షుడు కర్రీ వరహారెడ్డి అధ్యక్షతన జరిగాయి. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎంపీపీ దాసరి హైమవతి మాట్లాడుతూ ఎందరో విద్యార్థులు గ్రంథాలయాలను ఉపయోగించుకుని ఉన్నత స్థానాలకు చేరుకున్నారన్నారు. అనంతరంగ్రామ సర్పంచ్ తాడేపల్లి సూర్య కళా మాట్లాడుతూ గ్రంథాలయంలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి రెడ్డి సూరిబాబు, ఒకటో వార్డు సభ్యులు కాసారపు శ్రీను, తదితరులు పాల్గొన్నారు. గ్రంథాలయ అధికారి మహమ్మద్ అలీ ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

బుట్టాయిగూడెంలో : జవహర్ లాల్ నెహ్రూ దార్శనికత దేశాన్ని సైన్స్ అండ్ టెక్నాలజీ వైపు నడిపించిందని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ మర్రి వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం డిగ్రీ కళాశాలలో భారత దేశ తొలి ప్రధాని జవహర్లాల్ నెహ్రూ జన్మదిన వేడుకను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెహ్రూ అధ్వర్యంలో దేశం అలీన విధానం ద్వారా ప్రపంచ దేశాలతో సఖ్యత ఏర్పాటు చేసి దేశంలో భారీ పరిశ్రమలు, నీటి పారుదల ప్రాజెక్టులు నెలకొల్పి పేదరికాన్ని నివారించడానికి తీవ్రమైన కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు సునీత, భాగ్య లక్ష్మీ, శ్రీను, విద్యార్థులు పాల్గొన్నారు.

కొయ్యలగూడెంలో: బాలల దినోత్సవం సందర్భంగా స్థానిక ఎస్సీ కాలనీలో ఉన్న ఎంపీపీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు తాడేపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో బాలల దినోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థినీ విద్యార్థులకు పాఠశాల ఉపాధ్యాయులు వివిధ పోటీలను నిర్వహించి బహుమతులను అందజేశారు. విద్యార్థులంతా పాటలు, డ్యాన్సులు నిర్వహించి ఆనంద ఉత్సాహంలో తేలి ఆడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు టి. కృషి వరావు, పూలపల్లి కనకమహాలక్ష్మి, స్మైల్ ఆర్గనైజేషన్ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు బొబ్బర మంగరాజు, విద్యా కమిటీ వైస్ చైర్మన్ తానేటి పార్వతి, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

చాట్రాయిలో : గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని చాట్రాయి పంచాయతీ సర్పంచ్ దామెర ఉషా తెలిపారు. 55వ గ్రంథాలయ వారోత్సవాలు సందర్భంగా సోమవారం మండల కేంద్రమైన చాట్రాయి గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఉషా మాట్లాడుతూ విద్యార్థినీ, విద్యార్థులంతా గ్రంధాలయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పుస్తక పఠనం మేదో సంపత్తిని పెంచుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సంకు శివకుమారి, జడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ రెడ్డి,మండల పరిషత్తు పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.రాము పాల్గొన్నారు.

స్వాతంత్ర్య కోసం నెహ్రూ పోరాటం స్ఫూర్తిదాయకం

విశాలాంధ్ర - మండపేట : భారత స్వాతంత్ర్యం కోసం పండిట్ జవహర్ లాల్ నెహ్రూ చేసిన పోరాటం దేశ ప్రజలు మరువలేరని ఆయన పోరాట పటిమ నేటి తరానికి స్ఫూర్తి దాయకమని ఏఐసీసీ సభ్యుడు మండపేట నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కామన ప్రభాకరరావు అన్నారు. భారత తొలి ప్రధాని కీ.శే.పండిట్ జవహర్లాల్ నెహ్రూ 133వ జయంతి సందర్భంగా కామన నేతృత్వంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బాలల దినోత్సవాన్ని నిర్వహిస్తూ నెహ్రూ చిత్రపటానికి ఆయన పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కొడవళ్ళ సుబ్బారావు, మగ్గం జాకబ్ రాజు, పిల్లి అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

కపిలేశ్వరపురంలో : డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురంలో 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మండల కేంద్రం కపిలేశ్వరపురంలో గ్రంథాలయ వారోత్సవాలు, గ్రంథాలయాధికారిణి డి. శివ కుమారి ఆధ్వర్యంలో, గ్రామ సర్పంచ్ సాక శ్రీను అధ్యక్షతన ఘనంగా జరిగాయి. అంతకు ముందు నెహ్రూ, గాంధీ, సర్ ఆర్థర్ కాటన్ విగ్రహాలకు చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పలువురు వక్తలు మాట్లాడుతూ స్వాతంత్రోద్యమ చరిత్ర, స్వాతంత్ర్య పోరాట పటిమ, ఆ రోజుల్లో గ్రంథాలయాల పాత్ర తదితర వివరాలను విద్యార్థిని విద్యార్థులకు వివరించారు. తదుపరి విద్యార్థిని విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సాక శ్రీనివాస్, వైఎస్ఆర్సిపి నాయకులు పీతల బంగారం, కుడిపుడి విజయ్ కుమార్, కిక్ బాక్సర్ సురేష్, ఫీల్డ్ అసిస్టెంట్ నాగూర్ బాబు, సచివాలయం వన్ సెక్రటరీ సాయి ప్రసాద్, సచివాలయం టు సెక్రటరీ తేజ, సచివాలయం సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అనపర్తిలో : భారత దేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా సోమవారం అనపర్తి పాత ఊరులోని టీటీడీ కల్యాణ మండపం ప్రాంతంలో గల జిబిఆర్ లెర్నింగ్ ట్రీ స్కూల్లో హెచ్ఎం భారతి ఆధ్వర్యంలో బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. పిల్లలు వివిధ వేషధారణ దుస్తులు ధరించి ప్రత్యేక ప్రదర్శనలతో అందరినీ ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో జిబిఆర్ విద్యాసంస్థల చైర్మన్ తేతలి ఆదిరెడ్డి (కొండబాబు), మాజీ జెడ్పిటిసి కర్రి ధర్మారెడ్డి (దొరబాబు) దంపతులు, టిడిపి పార్టీ మండల అధ్యక్షులు కొవ్వూరి శ్రీనివాసరెడ్డి (దత్తుడు శ్రీను), అనపర్తి ప్రెస్ క్లబ్ అధ్యక్షులు సత్తి వెంకటరెడ్డి అరుణ, సత్తి సంతోష్ రెడ్డి వాణి ప్రసన్న, ఉపాధ్యాయులు కల్పనా రెడ్డి, లలిత, లక్ష్మి, మాజీ జెడ్పీటీసీ కర్రి ధర్మారెడ్డి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కరపలో: కరప మండలంలోని వేలంగి, కరప శాఖ గ్రంథాలయాలలో 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని బాలల దినోత్సవంను గ్రంథాలయ ఉపాధ్యాయులు పి. వెంకటరంగయ్య, ఎన్‌విఎన్ పి కుమార్ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతదేశ మొదటి ప్రధాని జవహర్లాల్ నెహ్రూ జన్మదినాన్ని బాలల దినోత్సవంగా జరుపుకుంటున్నామని రంగయ్యఫణీంద్ర తెలిపారు. ఈ కార్యక్రమంలో సవిలే రాజేష్ పట్టా కృపారావు, శ్రీనివాస్, సాదే లోహిదాస్, పంచాయతీ కార్యదర్శి సునీల్ కుమార్, నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

అంబాజీపేటలో : 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు అంబాజీ పేటలో గ్రంథాలయ అధికారి జి. శ్రీనివాసు అధ్యక్షతన సోమవారం ప్రారంభించారు. గ్రామ సర్పంచ్ నాగాబత్తుల శాంత కుమారి సుబ్బారావు జాతీయ పతాకావిష్కరణ చేసి, జ్యోతి ప్రజ్వలన చేశారు. విద్యార్థులకు బాలల దినోత్సవం సందర్భంగా శుభాకాంక్షలు తెలుపుతూ నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేశారు. గ్రంథాలయ ఆవరణంలో చిన్నారులు పూల మొక్కలను నాటారు. నవంబర్ 15 నుండి గ్రంథాలయ ఆవరణలో పుస్తక ప్రదర్శన నిర్వహిస్తారని, విద్యార్థులు వినియోగించుకోవలసిందిగా గ్రంథాలయ అధికారి శ్రీనివాసు కోరారు. ఈ కార్యక్రమంలో సుదాబత్తుల లక్ష్మీ భార్గవి, సుదాబత్తుల రాము, మద్దింశెట్టి లక్ష్మీ పార్వతి, అరిగెల బలరామమూర్తి, రిటైర్డ్ గ్రంథాలయ పాలకులు యంవివి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆలమూరులో : భారత స్వాతంత్రోద్యమంలో జవహర్ లాల్ నెహ్రూ పోరాట నాయకుడుగా ప్రముఖ పాత్ర పోషించి "పండిత్ జీ"గా ప్రాచుర్యం పొందారని ఆలమూరు మండల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కన్వీనర్ తమ్మన శ్రీనివాసు అన్నారు. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం చెముడులంక ఎస్‌టిఎస్ఎన్ఎమ్ ప్రభుత్వ పాఠశాలలో విద్య కమిటీ చైర్మన్ సుంకర శ్రీనివాసుతో కలిసి నెహ్రూ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పాఠశాల ఆవరణలో విద్యార్థిని విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పాఠశాల క్రీడా మైదానంలో నిర్వహించిన ఆటల పోటీల్లో గెలుపొందిన విద్యార్థిని విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఏడిద నాగేశ్వరరావు, దొండపాటి చంటి, తిర్నాతి వెంకటేశ్వరరావు, మోటూరి సురేష్, దొండపాటి వెంకటేశ్వరరావు (బులిరెడ్డి), బి వీర వెంకట్రావు, తమ్మన హరి, దూలం తిరుపతిరావు, బొర్రా వీరబాబు, పలువురు ఉపాధ్యాయులు, బాలబాలికలు పాల్గొన్నారు.

తాళ్ళపూడిలో : మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల రాగోలపల్లిలో భారతదేశ మొదటి ప్రధాన మంత్రి జవహర్ లాల్ నెహ్రూ జయంతిని సోమవారం బాలల దినోత్సవంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా నెహ్రూ చిత్ర పటం వద్ద విద్యార్థులు, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది ఘనంగా నివాళులు అర్పించారు. ప్రధానోపాధ్యాయుడు డిడి రావు నెహ్రూ జన్మదినాన్ని బాలల దినోత్సవంగా జరుపుకొనుటకు కారణాలను వివరించారు. అనంతరం బాల బాలికలకు బహుమతులు, మిఠాయిలు పంచారు. ఈ కార్యక్రమంలో సహోపాధ్యాయుడు ఈతకోట సత్యనారాయణ, ఆయా కుమారి, మ.భో.కార్మికురాలు వరలక్ష్మి ఉన్నారు.

గోపాలపురంలో : భారతదేశ నిర్మాణానికి కృషి చేసిన మహోన్నత వ్యక్తి స్వర్గీయ ప్రధాని జవహర్లాల్ నెహ్రూ ఆదర్శనీయుడని పాఠశాల హెచ్ ఎం రాజశేఖర్ అన్నారు. సోమవారం మండలంలోని వెంకటాయపాలెం ప్రాథమిక పాఠశాలలో బాలల దినోత్సవం వేడుకలను ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహించారు. ముందుగా నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమం అనంతరం విద్యార్థులకు మిఠాయిలు పంచారు.

గండేపల్లిలో:గండేపల్లి మండలం మల్లేపల్లి హైస్కూల్లో పండిట్ జవహర్ లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా, బాలల దినోత్సవం పురస్కరించుకుని ప్రధానోపాధ్యాయురాలు సుధా మాధురి ఆధ్వర్యంలో, విద్యా కమిటీ చైర్మన్ ఉనమంట్ల వెంకటేశ్వరరావు అధ్యక్షతన పిల్లలతో ముందుగా కేక్ కటింగ్ చేయించారు. అనంతరం విద్యార్థులకు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలుపై అవగాహన

విశాలాంధ్ర - ప్రత్తిపాడు : కాకినాడ జిల్లా ప్రత్తిపాడు ఎంపీడీవో కార్యాలయంలో ధాన్యం కొనుగోలు పై అవగాహన సదస్సు సోమవారం నిర్వహించారు. దీనిలో భాగంగా గ్రామ వ్యవసాయ సహాయకులకు, టెక్నికల్ అసిస్టెంట్లకు, ఓట్ ఆఫీసర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ అవగాహన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పెద్దాపురం డిఎల్‌డివో కేవిఎస్‌వి ప్రసాద్ రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు 17% తేమ శాతం ఉంటే రైతులకు రైతు భరోసా కేంద్రాల ద్వారా మద్దతు ధర బస్తాకు 1530 రూపాయలు ఇస్తామన్నారు. రవాణా ఖర్చులు మరియు కూలీ ఖర్చులు రైతు పెట్టుకున్నట్లయితే ధాన్యం డబ్బులతో పాటు అవి కూడా కూడా రైతుకు జమ చేయడం జరుగుతుందన్నారు. టన్నుకు 250 రూపాయలు రవాణా ఖర్చులు, 250 రూపాయలు కూలి ఖర్చులు ఇవ్వడం జరుగుతుందని తెలియజేశారు. రైతులు కోత కోసిన తర్వాత సంబంధిత రైతు భరోసా కేంద్రాల్లో తెలియచేసినట్లయితే టెక్నికల్ అసిస్టెంట్స్ పొలానికి వచ్చి శాంపిలు కలెక్ట్ చేసి తేమ శాతం పరీక్షించి 17% లోపు ఉన్నట్లయితే ట్రక్ షీట్, మరియు ఎఫ్‌టిఓ జనరేట్ చేసి మిల్లుకు పంపించడం జరుగుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఎస్ వెంకటాచలం, తాసిల్దారు పీవీవి గోపాలకృష్ణ, ఏవో ఇంటి వీర గంగాధర్, గ్రామ వ్యవసాయ సహాయకులు, వంశి, అర్జున్, లోవ ప్రకాష్, శంకర్, శిరీష, భవాని, రామలక్ష్మి, రూట్ ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞానాన్ని పెంపొందించేందుకు గ్రంథాలయాలు దోహదం

విశాలాంధ్ర - ఏలేశ్వరం : విద్యార్థులు తమ విజ్ఞానాన్ని, మేధా సంపాదన పెంపొందించేందుకు గ్రంథాలయాలు దోహదపడతాయని వైస్ చైర్ పర్సన్ శిడగం త్రివేణి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. స్థానిక శాఖ గ్రంథాలయంలో సోమవారం 55వ గ్రంథాలయ వారోత్సవాలను చైర్పర్సన్ ప్రారంభించారు. గ్రంథాలయ భవన స్థలదాత మూది నారాయణస్వామి మాట్లాడుతూ విద్యార్థి దశనుండే పుస్తక పఠనం అలవర్చుకోవడం ద్వారా భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చు అన్నారు. గ్రంథాలయ పాలకుడు కవికొండల సత్యనారాయణ మాట్లాడుతూ నేటి నుండి ఈ నెల 20 తేదీ వరకు వారోత్సవాల్లో భాగంగా ప్రతిరోజు విద్యార్థులకు పుస్తక పఠనం, చిత్రలేఖనం, చేతిరాత తదితర అంశాలపై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు.

శివ సన్నిధిలో రౌతులపూడి బాల గణేష్ గ్రూపు కోలాటం

భక్తుల రద్దీతో శివాలయాలు

విశాలాంధ్ర - రౌతులపూడి : శివనామస్మ మండలంలోని శృంగ వరం గ్రామంలో స్వయంగా వెలసిన శ్రీ ఉమా వర్ధిని నాగ లింగేశ్వర స్వామి ఆలయం సోమవారం శివ భక్తుల శివ నామస్మరణతో మారు మ్రోగింది. పరిసర గ్రామాల నుండి పట్టణాల నుండి అధిక సంఖ్యలో భక్తులు దేవాలయానికి చేరుకొని భక్తి ప్రభక్తులతో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా రౌతులపూడి శ్రీ బాల గణేషా గ్రూపు వారిచే దేవాలయ కమిటీ సభ్యులు కోలాటం ఏర్పాటు చేశారు. ఎంపీటీసీ సభ్యులు గాదిరాజు బాబు ఆ దంపతులకు దగ్గర ఉండి శివ దర్శనం చేయించి ఆలయ ప్రసాదాలు అందజేశారు. అన్నదానం ఏర్పాటు చేసి ప్రతి వలస భక్తులకు ఏ ఇబ్బంది కలగకుండా కమిటీ సభ్యులు అన్ని సౌకర్యాలు సమకూర్చారు.

ఆదిత్యలో ఘనంగా ప్రారంభమైన పోలీ టెక్ ఫెస్ట్ 2కె 22

విశాలాంధ్ర - గండేపల్లి : గండేపల్లి మండలం, సూరంపాలెం లోకల ఆదిత్య పాలిటెక్నిక్ కళాశాలలో డిపార్టుమెంటు ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ వారిచే ఈ నెల 14, 15 తేదీల్లో రీజినల్ పోలీటెక్ ఫెస్ట్-2కె22 ఘనంగా ప్రారంభమైంది. ప్రారంభ సమావేశానికి ముఖ్య అతిథులుగా జగ్గంపేట శాసన సభ్యులు జ్యోతుల చంటిబాబు, ఏపీ టెక్నికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ సి.నాగరాణి, ఆదిత్య విద్యాసంస్థల అధినేత, మాజీ ఎం.ఎల్ సి, మాజీ ఎం.ఎల్.ఏ. డాక్టర్ ఎన్.శేషారెడ్డి ముఖ్య అతిథులుగా విచ్చేయగా ఆర్.జె.డి. జె.సత్యనారాయణ మూర్తి, ఏ.పి.టి.ప్రిన్సిపాల్ జనార్ధన రావు, ఆదిత్య విద్యా సంస్థల వైస్ చైర్మన్ డాక్టర్ ఎన్.సతీష్ రెడ్డి, డైరెక్టర్ ఎన్.శృతి రెడ్డి, ఆదిత్య పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్.ఎస్.టి.వి.ఎస్.కుమార్‌లు పాల్గొన్నారు. డైరెక్టర్ సి.నాగరాణిని ఆదిత్య యాజమాన్యం తరుపున ఘనంగా సత్కరిం చారు. అనంతరం విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టు లను తిలకించారు. ఈ కార్యక్రమంలో డీన్ ఎ.వి.మాధవరావు, వివిద విభాగాధిపతులు జిల్లాలో గల ప్రభుత్వ,ప్రయివేట్ కళాశాలలకు చెందిన ప్రిన్సిపాల్స్ ఉపాధ్యాయ సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

మెండుగా భక్తి ఆధ్యాత్మిక భావనలు

విశాలాంధ్ర - అనపర్తి : పచ్చని చెట్లు, ఆహ్లాదకరమైన వాతావరణంలో కుటుంబ సభ్యులు, బంధు మిత్రుల సపరివారంగా విందు భోజనాలు చేయడం వెనుక భక్తి, ఆధ్యాత్మిక భావనలు మెండుగా ఉంటాయని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి అన్నారు. సోమవారం అనపర్తి మండలం పెదపర్తిలో సర్పంచ్ నల్లమిల్లి కాంతమ్మ అమ్మి రెడ్డి ఆధ్వర్యంలో భారీగా ఏర్పాటుచేసిన కార్తీక వన సమారాధన కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణ రెడ్డి ఆదిలక్ష్మి దంపతులు పాల్గొనగా సుమారు 5వేల మంది భక్తులు వన భోజనం స్వీకరించారు. ఇంకా ఈ కార్యక్రమంలో పలువురు ప్రజా ప్రతినిధులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జగనన్న ఇళ్ల పట్టాల వివరాలపై వినతి పత్రం

విశాలాంధ్ర - కరప : కరప మండలంలో జగనన్న ఇంటి పట్టాలను అర్హులైన లబ్ధిదారులకు అందించిన వివరాలను అందించాలని జనసేన పార్టీ గ్రామ అధ్యక్షులు, పి దుర్గాప్రసాద్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బి. గంగాధర్ ఆధ్వర్యంలో గ్రామ సచివాలయ అధికారికి వినతి పత్రం సమర్పించినట్టు దుర్గ ప్రసాద్ తెలిపారు. ఇప్పటివరకు ఎంతమందికి ఇంటి రుణాలు మంజూరు చేశారు, ఎన్ని ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి, ఎంతమంది అర్హులకు పట్టాలిచ్చారో తెలియపరచాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లెలు ప్రసాద్ వై. పండు, రమేష్ తదితర నాయకులు పాల్గొన్నారు.

నాయకుల జేబుల నింపడానికే జగనన్న ఇళ్ల స్థలాలు

విశాలాంధ్ర - సీతానగరం : నాయకుల జేబుల నింపడానికే జగనన్న ఇళ్ల స్థలాలు అని రాజానగరం నియోజకవర్గం జనసేన నాయకుల బత్తుల బలరామకృష్ణ అన్నారు. జగనన్న ఇళ్లు-పేదలందరికీ కన్నీళ్లు' కార్యక్రమంలో భాగంగా సీతానగరం మండలంలో సింగవరం వంగలపూడి గ్రామాల్లో బత్తుల బలరామకృష్ణ ఆధ్వర్యంలో పరిశీలన నిర్వహించి నిరసన తెలియచేశారు. ఈ సందర్భంగా బత్తుల బలరామకృష్ణ మాట్లడుతూ వంగలపూడి సింగవరం గ్రామాలకు సుమారు 7, 8 కిలోమీటర్లు దూరంలో ప్రజలకు ఏమాత్రం నివాసయోగ్యానికి అనుకూలంగా లేని ప్రాంతాల్లో ఇళ్ల స్థలాన్ని కేటాయించారని దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో బత్తుల వెంకటలక్ష్మి, మట్టా వెంకటేశ్వరరావు, మద్దల ఏసుపాదం, మద్దాల జీవన్, చీకట్ల వీర్రాజు, కొండేటి సత్యనారాయణ, జనసేన నాయకులు, జన సైనికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలు

విశాలాంధ్ర - దేవరపల్లి : గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలని ఎంపీపీ కెవికె దుర్గారావు అన్నారు. మండల కేంద్రమైన దేవరపల్లి శాఖ గ్రంథాలయంలో 55 జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా సరస్వతి చిత్రపటానికి ఎంపీపీ దుర్గా రావు పూలమాల వేశారు. నెహ్రూ చిత్రపటానికి గ్రంథాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ దాపార్తి సోమరాజు పూల మాలలు వేశారు. చల్లా లక్ష్మి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ కంప్యూటర్ రీడింగ్ కన్నా పుస్తక పఠనం వల్ల ఎంతో విజ్ఞానం, మానసిక వికాసం తోడ్పడతాయన్నారు. ప్రతి విద్యార్థిని విద్యార్థులు గ్రంథాలయం పఠనం అలవర్చుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షుడు సాదే సుబ్బారావు, ఏఎంసీ డైరెక్టర్ డి గంగాధర్, సొసైటీ అధ్యక్షులు కవల శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ కడిమి రాజు, పచ్చ రాంగోపాల్, మాధవరపు వెంకటేశ్వరరావు, గ్రంథ పాలకుడు కే వి వి ప్రసాద్, విద్యార్థిని, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నెహ్రూ జయంతి

విశాలాంధ్ర - కాకినాడ : భారత తొలిప్రధాని పండిట్ జవహర్‌లాల్ జయంతి 133వ జయంతి కార్యక్రమాన్ని సోమవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. పీసీసీ సభ్యులు నులుకుర్తి వెంకటేశ్వరరావు, ఆకుల వెంకటరమణ, జిల్లా అధికారప్రతినిధి పెద్దాడ సుబ్బారాయుడు తదితరులు మాట్లాడుతూ నెహ్రూజయంతిని బాలల దినోత్సవంగా జరుపుకోవడం ఆయనకు ఇచ్చే నివాళిగా పేర్కొన్నారు. ఈ సందర్భంగా నెహ్రూ చిత్రపటానికి పూలమాలవేసి శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పెద్దాడ సుబ్బారాయుడు, కంభం రాజబాబు, పులగల రాజు, పిట్టా అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

పీఆర్ కళాశాలలో : పీఆర్ ప్రభుత్వ కళాశాల ఆధ్వర్యంలో సోమవారం 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించారు. కళాశాలనుంచి పుస్తకాల విలువను చాటిచెప్పేలా భారీ ర్యాలీ నిర్వహించారు. గ్రంథాలయంతో విజ్ఞానం పెరుగుతుందని, ప్రతీవిద్యార్థి విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని పీఆర్ ప్రభుత్వకళాశాల ప్రిన్సిపాల్ బి.వి.తిరుపాణ్యం అన్నారు. వైస్ ప్రిన్సిపాల్ చెన్నారావు మాట్లాడుతూ పుస్తకపఠనం అలవర్చుకుంటే ఎన్నో ప్రయోజనాలుంటాయని తెలియచేశారు. లైబ్రరీ ఇన్‌ఛార్జ్ ఎం.సోమరాజు మాట్లాడుతూ విజ్ఞాన భండాగారాలే గ్రంథాలయాలని పేర్కొన్నారు.